


# ఆమ్నాపుజను

యండమూర్తి సత్యన్నారాయణరావు

ప్రకృతి మరో అందమైన ఉదయాన్ని ప్రసాదించబోతున్నది. సంక్రాంతి చలి చక్కిలిగిలి పెడుతున్నది. చెట్లమీద నించి లేచి, పక్షులు కిలకిలలాడుతూ చెరువుగట్టుకేసి ఎగరసాగాయి. చిరు చీకట్లలో- పల్లెటూరి పడుచులు రంగ వల్లులు దిద్దుతున్నారు.

పావుకోళ్ళ శబ్దం లయబద్ధంగా వినిపిస్తూ దగ్గరవసాగింది. ముగ్గులేస్తున్న ఆడవారూ, పందుంపుల్లలు నోళ్ళలో పెట్టుకొని, పొలం పనుల గురించి చర్చిస్తున్న పురుషులూ దగ్గరౌతున్న ఆ ఆకారాన్ని ఆసక్తితో, భక్తితో చూస్తున్నారు. తమను దాటిపోతుండగా 'అతనికి' చేతులు ముడిచి నమస్కారాలు చేస్తున్నారు.

అగ్నిహోత్రుడో, సూర్యభగవానుడో, అపర శంకరుడో దర్శనమిచ్చినట్టు వారు తన్మయులౌతున్నారు. అతను నడిచివెళ్ళిన ప్రదేశంలోని మట్టితీసి కళ్ళకందుకొంటున్నారు.

'కాశ్యప' ఎవరికీ ప్రతినమస్కారం

చేయడం లేదు. కనీసం ఎవరి వునికినీ గుర్తించను కూడా లేదు. వేదపాఠాన్ని స్ఫురింపజేసే నడకతో సాగిపోతున్నాడు.

ఆరడుగుల ఎత్తు, కండలు తిరిగిన ధృఢమైన శరీరం, పచ్చని పసిమిదేహం– పురాణాలలోని బ్రాహ్మణ్యం రూపం పోసుకుని లేచొచ్చినట్టుంటుంది అతని తీరు.

నున్నని గుండు, నుదుటిన, భుజాల పైన విబూధిరేఖలు, తడియారని పట్టు పంచ, భుజాలమీద నించి విశాలమైన ఛాతిపై పడుతూన్న చిన్న పట్టువస్త్రం– సాంప్రదాయకమైన అలంకరణకే అందం తెచ్చాడతను.

ఆ రోజుతో అతనికి యిరవై ఎనిమిదో యేడు ప్రవేశించింది. ఆ వయసుకే అతను వేదవేదాంగాలు, సకల శాస్త్రాలు సాకల్యంగా బోధపర్చుకొన్నాడు.

ఈ రోజున– ఏ సందర్భంలోనైనా హిందూమతపరమైన ధర్మ సందేహ మేదైనావుత్పన్నమైతే– కాశ్యపనుసలహా అడిగి, అతని నిర్ణయాన్ని ప్రామాణికంగా భావిస్తున్నారు. దేశంలోని ఏ హిందూ దేవస్థానమైనా అతని మాటనే వేదంగా అనుసరిస్తుంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా, వేలమంది జనం అతని దర్శనానికై పడిగాపులు పడతారు. అతని ఆశీర్వచనం పొందినవారు జన్మసాఫల్యమైనట్టు ఆనందిస్తారు.

అయితే– అతను మాత్రం సంపద సౌఖ్యాలకు, కీర్తిప్రతిష్ఠలకూ ఏనాడూ అర్రులు చాచలేదు. అతి ముఖ్యమైన పని పడితే తప్ప అతనా పల్లెను వదలడు. పెదవిని మెదవడు.

ఎంతవారికైనా ధర్మసూక్ష్మాలు చెప్ప గల స్థితిలోవున్న అతను పీఠాధిపతులతో ఒక విషయం పదేపదే చెప్పించు కొంటున్నాడు– నిన్ననే ఒక పీఠాధిపతి, అతనికి మరోసారి సందేశం పంపారు– 'తర్వగా వివాహం చేసుకొని, గృహస్థాశ్రమం స్వీకరించమని'– ప్రస్తుత మతనా విషయమే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

* * *

కాశ్యప గర్భగుడిలో ప్రవేశించి దీపం వెలిగించాడు.

అయిదున్నర అడుగుల ఎత్తులో, అత్యంత సౌందర్యంతో వెలుగుతున్న దుర్గాదేవి విగ్రహాన్ని తదేకంగా చూసాడు.

నాలుగు చేతులుతో వున్న ఆ విగ్రహం భీతి కలిగించే రీతిలోవుండదు.

గంభీరంగా వుండే కాశ్యవ వదనం, ఆ విగ్రహ దర్శనంతో ప్రఫుల్లమైంది. అతని పెదాలు మృదువుగా స్తోత్రాలను వల్లించసాగాయి.

రోజూ అలవాటుగా చేసే సేవా కార్యక్రమాలు ప్రారంభించాడతను.

అభిషేకం చేసేటప్పుడు అతని చేతులు కంపించాయి, విగ్రహానికి మరో పట్టు

వస్త్రం కట్టబెడుతుంటే అతని పెదాలపై చిరునవ్వు మెరిసింది.

సన్నగా గొణుగుతూ ఆభరణాలు అలంకరించాడు. దేవి నుదుటన తిలకం దిద్దాడు కిరీటం కూడా అమర్చిన తర్వాత, ఆ విగ్రహాన్ని ఆపాదమస్తకం పరిశీలిస్తూ-దాని ఎదుట, మోకాళ్ళ నేలకాన్చి కూర్చుని, రెండు చేతులూ ముందుకు చాపి, దోసిలి వొగ్గి, ఆ విగ్రహంతో మాట్లాడసాగాడు.

"దేవీ! నా మనసు నీకు తెలియజెప్ప నవసరంలేదనీ, నా అభీష్టం నెరవేర్చ మని కోరుకోనక్కరలేదనీ, యింత కాలం ఆగాను. గృహస్థాశ్రమం స్వీక రించమని నాపై ప్రవక్తల వత్తిడి ఎక్కువౌతున్నది. ఆ సమయం ఆసన్న మైందనే నేనూ తలుస్తున్నాను. వేరొకరిని భార్యగా స్వీకరిస్తే, నే నేర్చిన సమస్త విజ్ఞానాన్ని అగౌరవపరచినట్టేనని భావిస్తున్నాను. నీకు తెలియనిది లేదు! నా అభీష్టం నెరవేర్చు-" కాశ్యప ప్రార్థన పూర్తవగానే, బైట గంట మోగింది.

కాశ్యప లేచి వెళ్ళి గర్భగుడి తలుపులు తెరిచాడు.

గంట మోగిస్తున్న మాధవుడు కాశ్యపను చూడగానే నమస్కరించి- "స్వామీ! ఈ రోజు తలుపులు తెరవ డానికి ఆలశ్యమైందేమి?" అనడిగాడు.

మాధవుడికి పదహారేళ్ళ వయసుం టుంది. అతను కాశ్యపకు ప్రథమ శిష్యుడు.

"దేవికి ఈ రోజు ప్రత్యేక ప్రార్థన చేయవల్సి వచ్చింది" అంటూ మాధవుడితో పాటు బైటికి నడిచాడు కాశ్యప.

తర్వాత మాధవుడి కతను వేదపాఠం బోధించసాగాడు. గంభీరంగా వేదాన్ని పఠిస్తున్న కాశ్యప గొంతును ప్రకృతి చెవులొగ్గి వినసాగింది!

పాఠం పూర్తయ్యేసరికి భక్తుల రాక మొదలైంది.

ఆలయంలోకి వస్తున్న భక్తులు కాశ్యప పాదాలకు సాష్టాంగ ప్రమాణం చేసి, దేవీ దర్శనానికి వెళుతున్నారు. దేవి విగ్రహం కన్నా, సాక్షాత్తు పరమే శ్వరునిలా వుండే కాశ్యప భక్తులను అమితంగా ఆకర్షిస్తాడు.

ఆ రోజు మధ్యాహ్నం అనుకోకుండా యిద్దరు ప్రముఖులు కాశ్యపను కల్సుకో డానికి ఆలయానికి వచ్చారు.

ఏదో కార్యక్రమంపై పట్నానికి వచ్చిన ఒక మంత్రిగారు, కారులో ఆ పల్లెకు వచ్చి కాశ్యప దర్శనం చేసు కొన్నారు. కాశ్యపతో సంప్రదించి ఏ పని మొదలుపెట్టినా విజయవంతమౌతుందని ఆయనకు బాగా నమ్మకం. తన భవిష్యత్ రాజకీయ ఎత్తుగడల ఏఏ తేదీలలో అమలుజరిపితే మంచిదో ఆయన కాశ్యపను అడిగి తెల్సుకొన్నారు.

మంత్రిగారితోనే చాందీలాల్ అనే ఒక సేట్‌జీ కూడా కాశ్యప వద్దకు

వచ్చాడు. ఆయన పట్నంలో ఒక దేవాలయం నిర్మించాలని సంకల్పం కలిగి గతంలో కాశ్యపను సంప్రదించాడు. ఆ పట్నం యొక్క పౌరాణిక ప్రాముఖ్యత వల్ల అక్కడ కనకదుర్గ ఆలయం నిర్మించవల్సిందిగా కాశ్యప సేట్‌జీకి సలహా యిచ్చి, ఆయనతో వేరే దేవుని ఆలయం నిర్మించే వుద్దేశాన్ని విరమింప జేసాడు. ఆ ఆలయ నిర్మాణమప్పుడే ప్రారంభమైంది కూడా.

తిరిగి వెళ్ళిపోయేముందు చాందీలాల్ కాశ్యపను పక్కకు పిల్చి– "స్వామీ! మొన్న కాశీకి వెళ్ళినప్పుడు తమకు అందజేయమని తమ గురుదేవులు ఒక వర్తమానం పంపారు– నా వంటివాడు తమకు వార్త అందజేయతగడు గాని, గురుదేవుల ఆజ్ఞ, మీ దయాహృదయం నాకు తెల్సు గనుక చెప్ప సాహసిస్తు న్నాను–" అన్నాడు.

"చెప్పవయ్యా! గురుదేవుల వర్త మానం తెలియజేయడానికి సందేహ మెందుకు?" అన్నాడు కాశ్యప.

"సర్వం తెలిసిన నీకు వేరే చెప్ప వల్సిన పనిలేదుగాని– సంతానం లేని వానికి మోక్షమార్గం అంత సుగమంగా వుండదని నీకు జ్ఞాపకం చేయవల్సి వస్తున్నది. తగిన కన్యను చూసుకొని, పరిణయమాడి, నీవు త్వరలో గృహస్థా శ్రమం స్వీకరిస్తే అభిజ్ఞులు ఆనం దిస్తారు– అని గురుదేవులు తమకు తెలియజేయమన్నారు....మీ జవాబుకూడా తెలిపితే, వచ్చేవారం తిరిగి నేను కాశీకి వెళ్ళినప్పుడు దానిని గురుదేవులకు విన్న విస్తాను" అన్నాడు చాందీలాల్.

చిన్నగా నవ్వాడు కాశ్యప– "కన్యా న్వేషణ పూర్తయింది. త్వరలో కళ్యా ణం కూడా జరగవచ్చని గురుదేవులకు తెలపండి."


"చాలా సంతోషం" అన్నాడు చాందీ లాల్ శలవు తీసుకొంటూ. ఆయనకు అంత గొప్ప జాతకురాలయిన కన్య ఎవరో తెల్సుకోవాలని ఆతృత కలిగినా, కాశ్యప అంటే గల బెరుకు వలన తనకు తానై చనువు తీసుకొని ప్రశ్నిం చలేకపోయాడు.

అందరూ వెళ్ళిపోయిన తర్వాత కాశ్యప మాధవుడ్ని కాసేపు బైటవుండ వల్సిందిగా అజ్ఞాపించి, తను గర్భగుడి లోకి వెళ్ళి తలుపులు మూసాడు.

దేవీ విగ్రహం ముందు నిలబడి, చేతులు జోడించి, కళ్ళు మూసుకొని కాసేపు స్తోత్రం చేశాడు. అతని గొంతు రాళ్ళనుకూడా కరిగించేంత మార్దవంగా వుంది. విగ్రహం ప్రాణం పోసుకొని, సాక్షాత్కరించినట్టనిపించిం దతనికి.

"దేవీ! గురుదేవుల ఆజ్ఞ కూడా యిప్పుడే అందింది. నా మనసు వేరెవరినీ నా భార్యగా ఆమోదించడంలేదు. నిన్ను తప్ప వేరెవరినైనా నా గృహిణిగా వూహించాలన్నా నన్ను నేనే కించపర్చు

స్త్రీలకు ఆస్తి హక్కు :




కొన్నట్టు తోస్తున్నది. నువ్వే నా దానవు. ఎల్లుండి సంక్రాంతి నాటినుండి నువ్వు నా యిల్లాలు కావాల్సి వుంటుంది_" అని చెప్పాడు. కాశ్యప గొంతులో ప్రార్థన లేదు. అది నచ్చజెబుతున్నట్టుగా కూడా లేదు. సృష్టిని శాసించగల దృఢత్వం అతని కంఠంలో యిమిడివుంది !

ఆ తర్వాత కాశ్యప ఆలయంనించి బైటికివచ్చి, మాధవుడిని ఆ రోజుకు మిగిలిన కార్యక్రమాలు నిర్వహించ వల్సిందిగా చెప్పి, తన ఆశ్రమంకేసి నడిచాడు.

* * *

శక్తిస్వరూపిణి మరో రెండు రోజుల్లో కొత్తపెళ్లి కూతురు కానున్నది. ఆమె కేమి యిబ్బంది కలుగుతుందోనని ఆశ్రమంలో చిన్నచిన్న మార్పులు చేయ బోతాడు. అంతలో_ ఆమెకు తాను చేయ గల ఏర్పాట్లు ఏముంటాయని అన్నీ విర మించుకోని దిగులు చెందుతాడు.

కాశ్యప మనసు విచిత్రమైన ఆతృతతో నిండివున్నది. తన కోరిక తీర నున్నదా అనే సందేహమే మాత్రం అతనికి లేదు. తనకు కాబోయే యిల్లాలికి తగినంత హుందాతనాన్ని చూపగలడా తను_ అని మాత్రమే ఆలోచిస్తాడు.

ఆ పరిస్థితిలోనే అతనికి మాగన్నుగా నిద్రపట్టింది. ఆ నిద్రలో ఒక కల గూడా వచ్చింది. ఆ కలలో_

ఒక విశాలమైన మైదానం. ఎందుకో

అక్కడ వున్నవారందరూ గాలిలోకి లోకి ఎగురుతున్నారు. ఒకరికన్నా ఒకరు మరింత ఎత్తుకు ఎగరాలని పోటీ పడుతున్నారు. అప్రయత్నంగా కాశ్యప గూడా ఆ పోటీలో పాల్గొన్నాడు.

కాసేపటికల్లా అందరికన్నా ఎత్తుకు ఎగరసాగాడు కాశ్యప. అలా ఎగురుతుండగానే కాశ్యప ఒక విషయం గ్రహించగలిగాడు. మిగిలినవాళ్ళందరూ ఎంతో కొంత గాలిలో ఎగరగలరు గాని, తను మాత్రం గాలిలో ప్రయాణంకూడా చేయగలడు! ఆ తలపు రాగానే అతను మరోసారి గాలిలోకి లేచాడు.

ఈ సారి కిందకు దిగలేదు. అలా ఎగురుతూనే ఎటో వెళ్ళసాగాడు. కొంత దూరం వెళ్ళాక అతని కెందుచేతో యిక ఎగరలేనట్టు తోచింది. ఎదురుగా కనిపిస్తున్న కొండపై అతను దిగిపోయాడు.

కొండమీది ప్రాంతం చదురుగా వుంది. దాని సొగసు చూసి ఆశ్చర్యపోతూ అతనందులో సంచరించసాగాడు. ఇంతలో అతనికి కొందరు వ్యక్తులు ఎదురైనారు.

వాళ్ళు కాశ్యపను ఆపి– "ఎక్కడికి వెళ్తున్నావ్?" అని ప్రశ్నించారు. అతను జవాబిచ్చేలోపే– "అటు వెళ్ళకు .... ఆమె వచ్చేవేళయింది–" అని హడావిడిగా ఎటో వెళ్ళిపోయారు.

వారి గొంతులో వినిపించిన హెచ్చరిక, తనను ధిక్కరించవల్సిందిగా కాశ్యపను సవాలు చేసింది. ఆమె ఎవరో చూడాలని అతనికి ఆతృత కల్గింది. వారు ఎటువైపైతే వెళ్ళవద్దని చెప్పారో అటు నడిచాడు కాశ్యప.

అక్కడ–ఒక అందమైన మండపం! దాన్ని సమీపించాడతను. మండపం తలుపులు మూసుకొనున్నై. తలుపుల్లోంచి లోపలికి చూశాడతను. పెద్దపెద్ద పాత్రలలో ఫలాలు, పాలూ వుంచబడ్డాయక్కడ.

"ఎవరికోసమవి? ఆ వచ్చే ఆమెవరు?"

"ఇంకెవరు? యింత ఘనమైన మండపంలోకి వేంచేయనున్నది శక్తి స్వరూపిణి, సృష్టి కారకురాలూ కాక యింకెవరు? ఆమెకు కాక మరెవరికీ ఏర్పాట్లు?"

కాశ్యప గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆతృతగా ఎదురు చూడసాగాడు ఆమె రాకకోసం, దర్శనార్థం!

ఆమె రానే వచ్చింది! ఎట్నుంచి వచ్చిందో ఆ ఆతృతలో అతను గమనించనే లేకపోయాడు. 'ఆలయంలోని విగ్రహం ప్రాణంపోసుకొని వచ్చినట్టే వుంది!'

కాశ్యప హృదయం పరవశమైంది.

ఆమె కాశ్యపను చూసింది. ఆమె కళ్ళలో, పెదాలపై దరహాసం మెరిసింది! మరుక్షణం తలుపు తెర్చుకొన్నాయి.

కాశ్యప మండపంలోకి ప్రవేశించి,

ఆమెముందు మోకాళ్ళపై కూర్చుని, చేతులు చాచి ప్రార్థించసాగాడు, ఆమె సుందర విగ్రహాన్ని తనివితీరా చూస్తూ.

ఆమె కరుణించింది. "ఏమి కావాలి!" అనడిగింది.

విచిత్రం! ఫలానది కావాలని అడిగే తలపే లేదతనికి! అతని మనసు తృప్తితో నిండిపోయింది. ఆమెనే చూస్తూ వుండిపోయాడు.

ఇంతలో బైట ఏదో కలకలం విని పించింది.

"వాళ్లు వస్తున్నారు! నాకు తెల్చులే... నువ్వెళ్ళిపోయి మళ్ళీ రా!" చెప్పిందామె.

కాశ్యప తలూపుతూ లేచి బైటికి వచ్చాడు.

కాశ్యపకు మెలుకువ వచ్చింది. అతని హృదయం ఆనందంతో నిండిపోయింది.

ప్రతీ కలకూ అర్థాన్ని చెప్పగల సామర్థ్యం తనకున్నది. అతను కలలో కనిపించిన కొండలను గుర్తించాడు. ఊరికి పదిమైళ్ళ దూరంలోవున్న ఆ కొండలవద్దకు తను చిన్నతనంలో ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో భోజనా లకు వెళ్ళేవాడు.

ఆ కొండలపైన దేవి తనకోసం నిరీక్షిస్తున్నది!

ఇంతలో- తను చెరువుకు వెళ్ళ వల్సిన వేళయినట్టు అతనికి జ్ఞాపక మొచ్చింది. అలవాటుగా చెరువుగట్టువైపు నడిచాడతను.

స్నానాదికాలు ముగించుకొని, చెరువు గట్టునించి తిరిగి వస్తూండగా ముగ్గులు వేస్తున్న కన్యలు తెల్లవారకముందే లేచి అతని దర్శనానికి నిరీక్షించే జనం అతనికి సాష్టాంగపడి నమస్కారాలు చేస్తున్నారు. అతని అడుగుపడినచోటు నించి మట్టినితీసి కళ్ళకద్దుకొంటున్నారు.

కాశ్యప ఏదీ గమనించకుండానే ముందుకు సాగిపోతున్నాడు, దీర్ఘంగా ఆలోచిస్తూ. అతనికి ఆలయానిక్కూడా వెళ్ళాలనిపించడంలేదు.

'తనకోసం ఆమె కొండలపై నిరీక్షి స్తుండగా తనకు ఆలయంతో పనేమిటి?!' అతని ఆలోచన ఒక కొలిక్కి వచ్చింది. ఎకాఎకి ఆ కొండలపైకి వెళ్ళేందుకు ప్రయాణమయ్యాడు.

* * *

కాశ్యప కొండచివరికి వచ్చేసరికి, మధ్యాహ్నం మూడు గంటలైంది. అప్పటికతను మరో అడుగు కూడా ముందుకు వేయలేనిస్థితికి వచ్చాడు. దాహంతో అతని నాలుక పిడచగట్టుకు పోయింది.

ఇరవైమైళ్ళు-అందునా పదిమైళ్ళు- రాళ్ళు రప్పలతో నిండిన కాలిబాటపై నిట్టనిలువుగావుండే కొండ ఎక్కేందుకు అతను చాలా శ్రమపడ్డాడు. ఆ దారిలో ఒక మనిషైనా కనిపించడు. ఒకచుక్క- నీరు లభ్యంకాదు.

ఉదయంనించి పచ్చి మంచినీరైనా

ముట్టనందున అతను ఏ క్షణాన్నైనా స్పృహతప్పే స్థితికి వచ్చాడు. మరో మైలుదూరం నడిస్తేగాని, ఆ కొండపై గల ఆరు గ్రామాల్లో మొదటిదానిని అతను చేరలేడు.

ఏదైనా కొండవాగు కనిపిస్తుందేమోనని మరోసారి పరికించి చూశాడు.

కొండవాగు కనపడలేదుగానీ, ఒక స్త్రీ భుజంపై కడవతో ఎదురొస్తూ కనిపించింది.

ఆమె తనను సమీపించగానే- "యిక్కడికి దగ్గిరిలో ఏదైనా కొండవాగున్నదా?" అనడిగాడు కాశ్యప.

ఆమె కాశ్యపను పరిశీలనగా చూస్తూ "ఎందుకు?" అనడిగింది.

ఆ ప్రశ్నకు ఆశ్చర్యపోయి కాశ్యప ఆమెను తేరిపారజూశాడు. గొప్ప శిల్పి కష్టించి మలచిన శిల్పంలా వుందామె. అయిదున్నర అడుగుల ఎత్తులో, ఆరోగ్యంగా, యవ్వనం ప్రసాదించిన సొగసుతో మెరిసిపోతున్నది.

"అదేమి ప్రశ్న? వాగువద్ద కెందుకెళతారు?" అడిగాడు కాశ్యప.

ఆమె పెదాలపై చిన్నినవ్వు తళుక్కుమంది- "ఎందుకైనా వెళ్ళొచ్చు."

ఆమెతో వాదించే ఓపికా, కోరికా కాశ్యపకు లేవు- "దాహం తీర్చుకోడానికి" అన్నాడు.

"అయితే నే తెచ్చిన కడవలో నీరుంది తాగు" అందామె.

"అవసరంలేదు.... వాగెక్కడుందో చెబితే, నేనే వెళ్ళి తాగుతాను."

"ఎందుకంత కష్టం?"

"నాకు కష్టపడటమే యిష్టం! నేను అందరివద్దనించీ స్వీకరించను_"

"ఓ! ఆచారమా? మంచినీటికీ మైలేనా??"

"నియమం! త్వరగా వాగెక్కడుందో చెప్పు_ నాకు చాలా దాహంగా వుంది!"

"నేను చెప్పను....అంత దాహంగా వుంటే నే నిచ్చే నీరు తాగు. లేకపోతే నువ్వే వెళ్ళి వెతుక్కో-" అందామె కవ్వింపుగా.

ఆమె జవాబుకు కాశ్యప చకితుడైనాడు_ "నీ వీ కొండజాతులవారికి చెందినదానివి కానట్టుంది?" అన్నాడు.

"ఇక్కడ ఆ జాతులే నివసించాలా?"

"వేరే జాతులకు చెందినవారు యిక్కడ వుండలేరని విన్నాను."

"ఔనా-" అందామె చిత్రంగా చూస్తూ. "_కానీ నువ్వనుకొన్నట్టు నేను వేరే జాతులకు చెందినదానను కాను. ఈ కొండలపైనే పుట్టి పెరిగాను. కొంతకాలం నాగరీకులవద్ద పనిచేయడం వల్ల నా ప్రవర్తన నీకు ఆ ఆలోచనను కలిగించి వుండొచ్చు."

"ఈ ఏకాంత ప్రదేశంలో ఏంజేస్తున్నావు?"

"మా నాన్న చేసిన ఒక తప్పుకు కులపెద్దలు మమ్మల్ని మూడు మాసాలు

ఊరినించి వెలివేశారు. మే మి ద్ద ర ం యిక్కడే చిన్న గుసిసె వేసుకోని వుంటున్నాం" చెప్పిందామె.

కాశ్యప తల పంకించి ముందుకు కదలబోయాడు.

"మంచినీళ్ళు తాగవూ? దాహం వేయడంలేదా?" అడిగిందామె ఆశ్చ ర్యంగా.

"దాహం వేస్తున్నది గానీ, నీ విచ్చే నీరు తాగను! నేనే వాగెక్కడుందో వెతుకుతాను" అన్నాడతను.

"నువ్వెవరు? ఈ కొండలమీద కెందు కొచ్చావ్?" అడిగిందామె ఆలోచనగా.

కాశ్యప సమాధానం చెప్పకుండా ముందుకు నడిచాడు.

"వాగెక్కడుందో నువ్వు కనుక్కో లేవు" సవాలు చేస్తున్నట్టు అన్నదామె.

"అయినా ఫర్వాలేదు_" అని ధీమాగా వెళ్ళిపోయాడతను.

ఆలోచనతో ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. అతను వెళ్ళినవైపు ఆశ్చ ర్యంతో చూడసాగింది. అంతలో ఏదో స్ఫురించినట్టు ఆమె కళ్ళు పెద్దవై నాయి! ఓ క్షణం ఆమె గుండె కొట్టు కోడం మానేసింది!

ఎంతసేపు వెతికినా కాశ్యప కొండ వాగుజాడ తెల్సుకోలేకపోయాడు. చివరి కతను ఒక పెద్దలోయను సమీపించాడు. లోయలో నీళ్ల ప్రవహిస్తున్న శబ్దం! అందులోకి ఎలా దిగాలో, నీటిని ఎలా సంపాదించుకోవాలో అతనికి తోచింది కాదు. అతను మరోక్షణంకూడా నిలబడ లేకపోయాడు. ఒక కొండరాయి చాటున కుప్పలా కూలిపోయాడు.

అప్రయత్నంగా అతను ఆదిశక్తిని ప్రార్థించసాగాడు. కాసేపట్లో అతనికి స్పృహతప్పింది.

మళ్ళీ అతనికి స్పృహ తెలిసేసరికి, అతని తల ఆ యువతి వడిలో వున్నది. అతని ముఖం శుభ్రంగా కడిగినట్టు తడిగా వుంది. ఆమె పైటకొంగుతో విసురుతున్నది. అత నామెవంక విస్మ యంగా చూశాడు.

"యింకొన్ని నీళ్ళు తాగు" అందామె, అతని గొంతులో చల్లనినీరు పోస్తూ.

అతనికి పూర్తిగా స్పృహ వచ్చింది.

"ఎందుకంత మొండితనం చేశావ్?" అడుగుతున్న దామె.

అతను చటుక్కున లేచి నిలబడ్డాడు.

"మొండితన మే మున్న ది? నా నియమం నేను పాటించాను_"

అతని మనోనిబ్బరం ఆమెను అమి తంగా ఆకర్షించింది. అయినా అతన్ని ఆట పట్టించాలనిపించిదామెకు.

"నే పోసిన నీరేగా తాగింది! మరిప్పుడా నియమ మేమయింది?"

"నాకు స్పృహ లేనప్పుడు జరిగిన దానికి నేనెలా అభ్యంతరపెట్టగలను?"

"నేను నీ వెనకనే వస్తున్నట్టు గమనించావేమో_ వాగెక్కడుందో

ఎలాగూ తెల్సుకోలేనని— బింకం సడల కుండా నీరు సంపాదించేందుకు మూర్ఛ నటించి వుండొచ్చుగా నువ్వు—" నవ్విందామె.

"నువ్వేలా అనుకొన్నా నా కథ్యం తరంలేదు.... కానీ నీకో విషయం చెప్పనా— నాకు జ్యోతిశ్శాస్త్రం పూర్తిగా తెల్సు—" అంటూ అతనేదో చెప్ప బోయాడు.

"అలాగా!" అంటూ చిత్రంగా నవ్విందామె.

"ఊఁ! నాకు డెబ్బయ్యేళ్ళ ఆయుష్షుంది.... నువ్విప్పుడా నీరు పోయకున్నా నేను బతికేవుండేవాడిని!" చెప్పాడతను గంభీరంగా.

"ఒహ్హో!" నువ్వు డెభ్భైయ్యేళ్ళు బతుకుతావా?" నవ్వుతున్నదామె.

"ఔను!"

"అయితే ఓ చిరంజీవీ! నీ జ్యోతిష్యం అంత నిఖార్సైనదే అయితే— యిక్కడ్నించి ఆ లోయలోకి దూకెయ్! నీ ఆయుష్షెంత గట్టిదో తెల్సుకొందాం" అందామె పరిహాసంగా.

కాశ్యప ఆమెను పరిశీలనగా చూసాడు.

"ఊఁ— దూకు! డబ్బయ్యేళ్ళు బతుకుతానన్నావుగా! అందులోకి దూకేయ్ చూద్దాం.... ఎలా బతుకుతావో!" కవ్వించిందామె.

కాశ్యప విజ్ఞానానికి అంతవరకూ ప్రశంసలేగాని, యిట్టి పరిహాసం, పరీక్షలూ ఎదురుకాలేదు. అతను విసుగ్గా చూసాడామెను.

"ఊఁ! ఏవిటి సందేహం?" అడిగిందామె విజయగర్వంతో!

వంద అడుగుల లోతైన లోయలోకి చూసాడు కాశ్యప. ఆదిశక్తిని ప్రార్థిస్తూ కళ్ళు మూసుకొన్నాడు. తృటిలో అతను లోయలో వుండేవాడేనేమోగాని— అతని భుజాలను నున్నటి చేతులు చుట్టివేసి, అతన్నాపాయి!

కాశ్యప కళ్ళు తెరిచాడు.

విశాలమైన కళ్ళతో ఆమె అతన్ని చూస్తున్నది. క్షణంసేపు యిద్దరి కళ్ళూ కల్సుకొన్నాయి.


భుజాలను చుట్టిన ఆమె చేతులు పైకి జరిగి, అతని కంఠాన్ని పెనవేశాయి. ఆమె అతన్ని హత్తుకుపోయింది. విశాలమైన అతని ఛాతిపై ఆమె వక్షం మెత్తగా హత్తుకొంటున్నది.

కంపించే స్వరంతో అడిగింది— "ఆ లోయలోకి దూకేద్దావనే?"

"అనేకదా అన్నావ్? మరెందుకాపావు!" కాశ్యప నవ్వాడు.

మరుక్షణం— అతన్ని బలంగా, ఇద్దరి మధ్య గాలికూడా చొరనంత గట్టిగా పెనవేసుకుపోయి, అతని నుదురును గాఢంగా చుంబించిందామె. అంతలోనే— తనను తను తెల్సుకొన్నట్టు— అతన్ని వదిలేసి దూరంగా జరిగింది.

స్త్రీలకు ఆస్తి హక్కు!




కాశ్యప పెదాలపై చిరునవ్వు చెరగలేదు— "ఎందుకాపాప్?" అడిగాడు తిరిగి.

"ఎందుకేవిటి? అందులోకి దూకింతర్వాత, నీ జ్యోతిష్యం తప్పని తెల్సుకోడానికి నువ్వు వుండవు! దాని వల్ల ప్రయోజనం లేదనిపించింది. నాకా— ఆ లోయలోకి దూకినవాళ్ళు బతకరని ఎలాగూ తెల్సు" అందామె.

ఆమె గొంతులో పూర్వపు నిబ్బరం లేదు.

"ఈ శుష్కవాదమెందుకు? ఆ లోయలోకి దూకి, బతికిరమ్మంటావా?" అడిగాడు.

ఆమె చటుక్కున అతని రెండు చేతులూ పట్టుకొంది.

"ఒద్దొద్దు.... నే నోడిపోయాను.... వప్పుకొంటున్నాను" అందామె.

చిన్నగా నవ్వాడు కాశ్యప. క్షణం సేపు ఆమె సంభ్రమంగా చూసింది అతన్ని.

తర్వాత అతనికి దూరంగా జరుగుతూ— "ఓ! నిన్ను తాకకూడదు! నీకు మడి కదూ—" అన్నది.

"ఏమి మడిలే.... ఒకేసారి ప్రాయశ్చిత్తం చేసుకోవల్సి వచ్చేట్టుంది" అన్నాడతను.

"సర్లే.... పద!" అంటూ ఆమె నవ్వు దాచుకుని, కిందనున్న కడవను అందుకొంది.

"ఎక్కడికి?" అడిగాడు కాశ్యప ఆశ్చర్యంగా.

"ఎక్కడికేవిటి! మా యింటికి.... నువ్వసలిక్కడి కెందుకొచ్చావో నిజం చెబుదూ-" అడిగిందామె.

"ఈ కొండలలో నే కోరేది దొరుకుతుందని-"

"ఎన్ని రోజులుంటావు?"

"నే కోరేది దొరికేవరకూ."

"యింకాసేపట్లో చీకటి పడుతుంది! నువ్వు ముందుకుపోయి చేయగలిగేదియేమీ లేదు.... రేపు వేకువతోటే లేచి వెళ్ళొచ్చు ... ఈ రాత్రికి మా యింట్లో వుండి, విశ్రాంతి తీసుకోరాదూ-"

అతనికీ అదే మంచిదిగా తోచింది.

"ఏదైనా ఒక వాగు ఎక్కడుందో చూసి, సంధ్య వార్చుకొని వస్తాను" అన్నాడతను.

ఆమె ఈసారి అతనితో వాదనకు దిగిలేదు. అతన్ని కొండవాగు వద్దకు తీసికెళ్ళింది.

* * *

రెల్లుగడ్డితో నేసిన ఆ పాకలో, చాప మీద కూర్చొనున్నాడు కాశ్యప. అప్పటికి చీకటి పడింది. ప్రశాంతమైన వాతావరణం, ఏకాంతం కాశ్యప హృదయాన్ని ప్రఫుల్లం చేసాయి.

"నీకు ఆకలిగా లేదూ?" అడిగిందామె.

"వుంది!" చెప్పాడతను.

"వంటచేయనా?"

"నాకు పాత్రలు యివ్వు.... నా వంట నేను చేసుకొంటాను!"

"అబ్బో- ఎంత నిష్ఠ! యివ్వకుంటే-"

"ఏమీ అవదు! ఒక్కనాటికి భోజనం లేకున్నా ఫర్వాలేదు."

"సరే! నేను నీకేమీ యివ్వను! నే చేసిన వంట తింటే తిను. లేకపోతే ఉపవాసం చేయి" అందామె.

కాశ్యప సమాధానం చెప్పలేదు. ఆమె తర్కించలేదు- అతను వంట చేసుకొనేందుకు ఏర్పాట్లు చేయలేదు. తనే పొయ్యి రాజేసి, వంట మొదలుపెట్టింది. చకచకా తిరుగుతూ ఆమె పనులు చేస్తుండగా కాశ్యప ఆమెతో సంభాషణకుపక్రమించాడు. ఆ కొండలపై గల గ్రామాల గురించి, దేవాలయాల గురించి అడిగాడు.

"యిక్కడ నాగరీకులుండే చోట్లలో వలె పెద్దపెద్ద ఆలయాలుండవు. కొన్ని చెట్లకింద, గుహల్లో వుండే ప్రత్యేకమైన కొండరాళ్ళకు, ఉత్సవాలప్పుడు పసుపు కుంకుమలు పూసి, కొండదేవతల పేర్లు పెట్టి, జాతర్లు జరుపుతారు" చెప్పిందామె.

అతన్తో మాట్లాడుతూనే ఆమె వంట పూర్తిచేసింది. అప్పటికి బాగా చీకటి పడింది.

"రా! భోజనం చేద్దువుగాని" అని పిల్చిందామె.

కాశ్యప ఉదయంనించి ఏమి తినలేదు. ఉపవాసాలుండటం అతని కలవాటే

అయినా, అలవాటు లేని నడక అతనికి విపరీతమైన అలసట కల్గించింది. ఆకలితో అతని పేగులు కేకలేస్తున్నాయి. అయినా వాటి ప్రభావం అతని గంభీరమైన వదనంలో కనిపించడంలేదు.

"అన్నం తినవూ?" పిల్చిందామె మరోసారి.

"అక్కర్లేదని యిందాకే చెప్పాను."

ఆమెకు కోపం వచ్చింది- "మొండి తనంతో ప్రతిదీ గెలవడం సాధ్యం కాదు-" అందామె.

"నువ్వెలా భావించినా, నా నియమానికి నువ్వే పేరుపెట్టుకొన్నా నా కభ్యంతరం లేదు. కానీ- నా నియమాన్ని నేను మీరినందున నీకు వచ్చే లాభమూ లేదు" అన్నాడతను.

ఒక పాత్రలో తనకు అన్నం పెట్టుకొన్నదామె. ఆమెకు కోపం వచ్చిందని గ్రహించి, చిరునవ్వుతో ఆమె సుందర వదనాన్ని చూడసాగాడతను. ఆమె అన్నం కలుపుకొని, ఓ ముద్ద నోట్లో పెట్టుకోబోయి ఆగింది_

"నిజంగా.... అంత ఆకలిగా వున్నా నే చేసిన వంట తినవా?"

"నిన్ను బాధించాలని కాదు.... అది నా నియమం" అన్నాడు ఓదార్పుగా.

ఆమె చేతిలోని ముద్దను పాత్రలో పడేసి, చెయ్యి కడుక్కొని, పాత్రలన్నీ ఓ పక్కకు సర్దేసింది. కాశ్యప కన్నార్పకుండా ఆమెనే చూస్తున్నాడు-

'ఎవరీమె? కొండలలో జన్మించి, పెరిగినవారికింత సంస్కారం ఉంటుందా?'

పచ్చని, కోమలమైన ఆమె శరీరం, విజ్ఞాన పూరితంగా, విశాలంగా వున్న కళ్ళు, నాజూకైన ముక్కు, కవ్వించే పల్చని పెదాలు అతన్లో సంచలనాన్ని కలిగించాయి.

ఆమె ఓ బుట్టలోంచి కొన్ని పండ్లు తీసుకొచ్చి- "ఫలాలకు మైల వుండదుగా-" అంటూ అతని ఎదురుగా కూర్చుంది.

కాశ్యప నున్నగా, నాజూకుగా వున్న ఆమె చేతుల్ని చూస్తున్నాడు.

అతనిలో వచ్చిన మార్పు నామె గమనించింది. ఓ పండు అతని నోటికి అందించబోయింది. అతను వారింపుగా ఆమె చేతిని పట్టుకొన్నాడు.

అతని మనసులో కోటి మెరుపులు మెరిసాయి!

ఈమె తను నిత్యం కొలిచే దేవత గాక మరెవరు? కలలో కనిపించి యిక్కడున్నానని తెలిపినా, తానామెను గుర్తించలేకపోయాడు. ఆమెతో వాదులాడాడు!

అకస్మాత్తుగా ఆమె ముందు, మోకాళ్ళపై కూర్చొని, చేతులు చాచి, దేవీస్తోత్రం చేయసాగాడతను. ఆమె నివ్వెరపోయి అతన్ని చూస్తున్నది.

ప్రార్థన పూర్తి కాగానే కాశ్యప-"దేవీ!

నిన్ను గుర్తించలేకపోయాను- నన్ను గ్రహించు!" అని వేడుకోసాగాడు.

"ఏమిటిదంతా!? నువ్వేదో పొరపడుతున్నావు" అందామె.

"లేదులేదు-" అంటూ కాశ్యప తన హృదయం, తన కల, ఆమె యిక్కడలా కొండపై కనపట్టం, మననం చేసుకొంటూ ఆమెకు వివరించసాగాడు.

"నువ్వో రకమైన మత్తులో వున్నావు.... నా మాట విను" అంటున్నదామె.

కాశ్యప ఆమె పాదాలపై పడి ముద్దు పెట్టుకోసాగాడు.

ఆమె అతన్ని లేవదీసి, గాఢంగా హృదయానికి హత్తుకొన్నది.

కాశ్యప హృదయం గంతులేయసాగింది.

ఆమె అతని పెదాలపై గాఢంగా ముద్దుపెట్టుకొంది.

కాలం ఆగిపోయింది. ప్రకృతి ఊపిరి బిగబట్టింది.

* * *

నగ్నంగావున్న ఆమె వక్షంపై చెంప ఆన్చి పడుకొన్నాడతను.

ఆమె పెదాలపై దరహాసం, కళ్ళలో మెరుపులు- అతని వీపునూ, మెడనూ నిమురుతున్నది.

కాశ్యప అకస్మాత్తుగా లేచి- "మనం వెళ్ళిపోదాం" అన్నాడు.

"ఎక్కడికి-" అందామె నవ్వుతూ.

"దేవీ! యిక నన్ను పరీక్షించకు.... నువ్వు నా యిల్లాలివి కావాలని ఎప్పుడో చెప్పాను."

"నువ్వు పొరబడుతున్నావు! నేను నువ్వారాధించే దేవతను కాను!"

"నేను పొరపడటంలేదు! ఒక కొండ జాతి కన్య ఎలా వుంటుందో నే నెరుగుదును.... నువ్వు నన్నిక మోసం చేయలేవు-"

"నిజమే! నేను కొండజాతికి చెందిన స్త్రీని కాను-" అంటూ ఆమె లేచి, వంటిపై వస్త్రం కప్పుకొంది.

తర్వాత ఆమె మృదువుగా చెప్పసాగింది- "నేను మొదట నిన్ను చూసినప్పుడు మాపై దర్యాప్తు జరపడానికి వచ్చినవాడివనుకొని అలా చెప్పాను. ఇక్కడ నాతోపాటు నా సహచరులు చాలామంది వుంటున్నారు.

"మేమంతా ఒక ఆశయాన్ని దృష్టిలో వుంచుకొని, కార్యసాధనకు ప్రయత్నిస్తున్నాం. నీ దారికి, మా దారి పూర్తిగా భిన్నమైనది! మేము ప్రపంచంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులు తెచ్చేందుకు ఒక పద్ధతిలో ప్రయత్నిస్తాం.... మమ్మల్ని వుగ్రవాదులంటారు.

"నాతోపాటు యిక్కడ వుండేవారు, యీ రోజు కొండక్రింది గ్రామాల్లోకి ఒక కార్యక్రమంకోసం వెళ్ళారు. ఈ ప్రదేశానికి కాపలా వుండవల్సిన వంతు యీసారి నాదైనందున- ఈ ఏకాంతం,



నీతో పరిచయం సాధ్యమైంది. నీ మనో నిబ్బరం, తీవి నన్నమితంగా ఆకర్షించాయి. కోట్లమంది ప్రశంసించే కాశ్యపవు నువ్వేనని గ్రహించాను.

"తెల్లవారేసరికి నా సహచరు లిక్కడికి తిరిగొస్తారు. నీ ప్రపంచంలో నీకు మహోన్నతస్థానం వుండొచ్చు....కానీ మాకు నీ దృక్పథంగానీ, గమ్యంగానీ హాస్యాస్పదంగా కనిపిస్తాయి. అందుకే నా సహచరులకు నువ్వు కనబడడం చాలా ప్రమాదం.... కాశ్యపవంటి ప్రత్యర్థి ఇంత సులభంగా దొరికినప్పుడు వారా అవకాశాన్ని వదులుకోడానికి యిష్టపడరు– నువ్వు తెల్లవారేసరికి యిక్కడ్నుంచి వెళ్ళిపో!" చెప్పిందామె.

"నువ్వు కొండజాతి కన్నెవే అవు,

సమాజాన్ని మార్చనెంచే వ్యగ్రవాదివే అవు- నే నారాధించే విగ్రహంలో నేను దర్శించే దేవతే- నీలోనూ నాకు కని పిస్తున్నది. నేను నిన్ను వి వా హ ం చే సు కొ ం టా ను. నాతో వచ్చెయ్-" అన్నాడు కాశ్యప.

ఆమె అతని కళ్ళలోకి చూస్తూ సూటిగా ప్రశ్నించింది. "నీ ఆలయం లోని విగ్రహంలోనూ, నా లో నూ మాత్రమే నీకు దైవం ఎందుకు కని పిస్తున్నది?"

కాశ్యప తడబడ్డాడు! మొదటిసారిగా తనను ఆలోచింపజేసే ప్రశ్నను అతను విన్నాడు.

"నీకు నీ వేదాలు, నీ నియమావళి ఎలాగో నాకు నా సిద్ధాంతమూ అలాగే! నమ్మినదాన్ని ఆచరించేందుకు నేనూ నీకులాగానే ప్రాణాలివ్వడానికైనా సిద్ధమే! నీ దారీ, నా దారీ ఏనాటికీ కలవ్వు! నేను నీతో రావడం అసాధ్యం!

"అయితే నీకు నీ గురించి వివరించా లనిపిస్తున్నది. నీ లోకంలో ఎవరూ అ ం దు కు సాహసించలేకపోవచ్చు గనుక నేను చెప్పేది జాగ్రత్తగా విను-" అంటూ అమె చెప్పసాగింది. "—నీ దృఢసంకల్పం నీకు వయసుకు మించిన విజ్ఞానాన్ని, అంతకు పదింతలు కీర్తి గౌరవాల్ని తెచ్చిపెట్టింది. అందువల్ల నీకు కలిగిన అహం- నీ విజ్ఞానం మరింత అభివృద్ధి చెందకుండా అడ్డు పడింది. నీవు నేర్చినదానిని, నీ ముందు జరిగే సంఘటనలకు అన్వయించి నిజానిజాల నిగ్గు తేల్చేందుకు నువ్వె న్నడూ ప్రయత్నించక, నువ్వు నేర్చిన దానితోనే తృప్తిచెందావు!

"ఎదుటివారు నీకాపాదించిన మహో న్నత్వంవల్ల నీకు తెలియకుండానే, అందర్నీ తక్కువగా భావించడం మొదలుపెట్టావు.... నీ అహం- మరో మానవమాత్రను నీ భార్యగా కూడా ఆమోదించనియ్యడం లేదు! నీ యవ్వ నం- నీలో దాని ప్రభావాన్ని చూపుతున్నా అహంకారంతో దాన్ని అణిచివేయబో యావు!


"ఈ మన స్తత్వంతోనే ఎవరో దృష్టి స్వరూపిణి వుందని, ఆమె నీ భార్య అవుతుందని ఆలోచించసాగావు. ఈ మన స్తత్వంవల్లనే నువ్వు- దైవానికి రూపం వుండదన్న నీ సిద్ధాంతపు ప్రాథమిక సత్యాన్ని కూడా నిర్లక్ష్యం చేసావు.

"కానా! నువ్వు నేర్చిందే నిజమను కొన్నా- దైవానికి పరిమితులు, ఆకా రాలూ ఎక్కడివి? కేవలం నీ అహంకా రం, యవ్వనం మాత్రమే దైవానికి ఓ స్త్రీ రూపాన్నిచ్చాయి.... ఆమెను నీ భార్యగా భావించేట్టు చేసాయి.

"నీ దృక్పథాన్ని, మా తర్కం పూర్తిగా వ్యతిరేకిస్తుంది. కానీ- నీ సాటివారు నాకింత మహోన్నతాన్ని

స్త్రీలకు ఆస్తిహక్కు :

ఇదిగో నువ్వు వెంటనే మీ పుట్టింటికి పోయి నీ వాటా ఆస్తి అడిగి పట్రా..... అంతవరకూ నా గుమ్మం తొక్కవద్దు. ఫో!




అంటగట్టినందుకైనా- వారిపట్ల ప్రేమను చూపించు. వారిని ఆలోచనాపరులుగా రూపొందించు.... నీ వా మాత్రం చేయగల్గినా నా వైపువారు నిన్ను కొంతలో కొంతైనా అభినందిస్తారు.... అది నీ సిద్ధాంతానికి లోబడే వుంటుంది కూడా-"

మృదువుగా, గంభీరంగా వున్న ఆమె మాటలన్నీతను శ్రద్ధగా విన్నాడు.

ఆలోచనతో అతని వదనం తపస్సులో మునిగిన ముని వదనంలా వుంది.

"నేను వెళుతున్నాను" అంటూ లేచాడతను.

"ఇంత చీకట్లోనా? చాలా ప్రమాదం" అందామె.

"ప్రమాదమా-" నవ్వాడతను. "-యిప్పుడు నేనున్న దానికన్నా ప్రమాదస్థితి వున్నదా? నే నింతవరకూ నేర్చినదాన్ని పూర్తిగా అర్థంచేసుకొన్నానా- అనే సందేహం కలుగుతున్నది. నన్ను నేను పరిశీలించుకోవల్సిన సమయం ఆసన్నమైంది" అంటూ అతను లేచాడు.

అతని వదనం, అతని నిశ్చయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నది. అతన్ని ఆపలేనని తెల్సుకొన్నదామె. దీపం చేతిలో పట్టుకొని బైటికివచ్చి, అతన్తో పాటు కొంత దూరం నడిచింది.

అతను అకస్మాత్తుగా ఆగి- "కృతజ్ఞుడను.... యిక నువ్వు వెనక్కి తిరిగి

నీ చోటికి వెళ్ళిపో.... నేను నా దారిన వెళ్ళగలను!" అన్నాడు.

ఆమె అతని చేయందుకొని, ముద్దాడి వీడ్కోలు పలికింది!

కాశ్యప ముందుకు సాగాడు.

వెనకనించి అతన్ని చూస్తున్న ఆమె కళ్ళలో నీరు తిరిగింది. కింద పెదవిని పంటితో కొరుకుతూ, చేతులు జోడించి కనుమరుగవుతున్న అతనికి నమస్కరించింది.

"ఆ మహాశయుని దృక్పథమేదైతే నేమి- దృఢదీక్ష, పట్టుదలా కలిగిన మహోన్నతుడు.... ఆయననించి మానవజాతి నేర్చుకోవల్సింది అపారంగా వుంది" అనుకొంటూ వెనక్కి తిరిగిం దామె!

* * *

ఆలయంలోని విగ్రహం ముందు చేతులు ముకుళించి నించున్నాడు కాశ్యప.

అతనా విగ్రహాన్ని యిప్పుడు సరిగా చూడగల్గుతున్నాడు!

హృదయాన్ని పరిపక్వం చేయగల శక్తి యేదో అతన్నావహిస్తుంది!!

కొంతసేపలా నించొని, తర్వాత మెల్లిగా బైటికొచ్చాడు. అతనికి ఆ పరిసరాలు పూర్వంలా లేవు. ప్రతీ పదార్థంలో- ఆలయంలోని విగ్రహంలో వలెనే- మనసును ఆనందంలో ముంచ గల శక్తి ద్యోతకమవుతున్నది.

అతను ఆలయంలోంచి బైటికొచ్చి చెరువుగట్టుకేసి నడవసాగాడు.

ఆ చిరుచీకట్లో- సంక్రాంతి ముగ్గు లేస్తున్న పడుచులు, పండగ సందడికి చీకటితోనే లేచిన జనం- కాశ్యప ఆ వేళలో చెరువుగట్టువైపునించి ఆల యానికి వెళ్ళవల్సినవాడు, ఆలయంనించి చెరువుకేసి వెళ్ళడం చూసి ఆశ్చర్య పోతున్నారు. అతనికి సాష్టాంగ ప్రణామాలు చేస్తూ, అతని పాదధూళి స్వీక రిస్తున్నారు.

కాశ్యప చిరునవ్వుతో వారికి ప్రత్యభి వాదం చేస్తూ, ముందుకు సాగాడు. సృష్టిలోని ప్రతీ అణువులో అతను దైవాన్ని దర్శించగలుగుతున్నాడు.

దైవాన్ని ఆరాధించడ మెలాగో అతను కనుగొన్నాడు!

దాన్ని ఆచరించేందు కతను ఆతృత పడుతున్నాడు!!

చెరువులోకి దిగి, స్నానం చేస్తూ ఆయన తన అహాన్ని, మోహాన్నీ కడిగేసుకొన్నాడు. ఆయన వదనం సూర్యుని మించిన కాంతితో వెలుగు తున్నది.

చెరువునించి ఆయన బైటకు వస్తుం డగా, తూరుపు దిక్కునించి బాలభానుడు పైకి లేచాడు. ఆనాడు సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశిస్తున్నాడు. జగతికి నవోదయం కానున్నది.